క్లుప్తంగా

ఆప్ యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్


నియామక పత్రం అందుకుంటున్న శ్రీనివాస్

నేలకొండపల్లి: ఆమ్ ఆద్మీ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండల కేంద్రానికి పసుమర్తి శ్రీనివాస్‌ను నియమిస్తూ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జ్ కన్వీనర్ డాక్టర్.డి.సుధాకర్ ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో నియామక ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ... పార్టీని బలోపేతం చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు.

పంట కాల్వ హద్దులు జరిపితే కేసులు

నేలకొండపల్లి: మండల కేంద్రంలో రియల్టర్లు వెంచర్ల ఏర్పాటు సమయంలో పంట కాలువ హద్దులు చెరిపివేస్తున్నారని అలా చేస్తే కేసులు నమోదు చేయిస్తామని ఇరిగేషన్ డీఈఈ మన్మథరావు హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో ఓ వెంచర్ నిర్వాహకులు పంట కాల్వ సమీపంలో పనులు చేయిస్తుండగా ఘటనా స్థలానికి వెళ్లి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హద్దులు ఏర్పాటు చేసిన అనంతరం పనులు చేసుకోవాలన్నారు. కాల్వ రెండు మీటర్ల వెడల్పు ఉండాల్సిందేనని, కాలువ పక్కన వెంచర్లు వేసే నిర్వాహకులు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు. సరైన పత్రాలతో దరఖాస్తు చేస్తే క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసిన అనంతరం అనుమతులపై నిర్ణయం తీసుకుంటామన్నారు. అప్పటి వరకు నిర్వాహకులు పనులు చేయొద్దన్నారు.

రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

ఖమ్మంవ్యవసాయం: వ్యవసాయంపై అవగాహన లేకుండా వ్యాఖ్యలు చేసిన పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలని రైతు బంధు సమితి జిల్లా సమన్వయ కర్త నల్లమల వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కరెంటుపై రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు చేస్తున్న దుర్మార్గాలను ఎండగడుతూ.. ఈ నెల 27వ తేదీ వరకు రైతు వేదికల్లో తీర్మానాలు చేయాలని తెలిపారు.

21న చలో కలెక్టరేట్

ఖమ్మంమయూరిసెంటర్: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, వేతనాలు పెంచాలని, చట్టబద్ధహక్కులు, సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఈ నెల 21న చలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నట్లు కార్మిక సంఘాల నాయకులు తెలిపాయి. సోమవారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, టీజీబీకేవీఎస్, సీఐటీయూ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు తోట రామాంజనేయులు, కె.శ్రీనివాస్ మాట్లాడుతూ... గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు పరచడంలో కార్మికులది ముఖ్యపాత్ర అని, వారితో అన్ని రకాల పనులు చేయిస్తున్న ప్రభుత్వం వారికి కనీస వేతనం ఇవ్వడం లేదన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గాదె లక్ష్మీనారాయణ, పంచాయతీ వర్కర్స్ యూనియన్ జేఏసీ నాయకులు రాందాస్, పిట్టల మల్లయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	బేబి
వినోద	నాయకుడు
సాయిరాం	సామజవరగమన
ఆదిత్య	మిషన్ ఇంపాసిబుల్ (తెలుగు)
శ్రీనివాస	మహావీరుడు

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	114	బచ్చలికూర	4
వంకాయ	26		10
బెండకాయ	30	పాలకూర	3
పచ్చిమిర్చి	100		10
కాకర	56	చుక్కకూర	3
బీర	44		10
దొండ	16	తోటకూర	4
పొట్లకాయ	50		10
చిక్కుడు	60	గోంగూర	2
గోరుచిక్కుడు	36		10
క్యాబేజీ	24	మెంతికూర	4
క్యాలీఫ్లవర్	50		20
ఆలుగడ్డ	24	కొత్తిమీర	1
చామగడ్డ	46		30
క్యాప్సికం	96	పుదీన	1
దోసకాయ	50		20
క్యారెట్	56	-ఖమ్మం వ్యవసాయం	

కూల్చివేతపై మీనమేషాలు

ప్రమాదకరంగా ప్రధాన తపాలా కార్యాలయ భవనం

- వందేళ్ల నిర్మాణాన్ని కూల్చడానికి కొరవడిన చర్యలు
- రెండేళ్లుగా కాగితాలకే పరిమితం
- చెట్లు పెరిగి కూలేందుకు సిద్ధంగా..


తపాలా భవనాన్ని ఆనుకొని ఉన్న దుకాణాలు


బీటలు బారిన గోడలు


భవనంపై చెట్లు..

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నడిబొడ్డున శిథిలమై ఉన్న ప్రధాన తపాలా కార్యాలయ భవనం కూల్చివేతపై ప్రభుత్వ శాఖలు మీనమేషాలు లెక్కిస్తున్నాయి. వానాకాలంలోనే కూల్చివేత వ్యవహారం బయటకు తీస్తూ, ఆ తరువాత సమస్యను విస్మరిస్తున్నాయి. రెండేళ్లుగా తపాలా భవనం కూల్చివేత వ్యవహారం కాగితాలకే పరిమితమైంది తప్పా కార్యరూపం దాల్చటం లేదు. జూలై, ఆగస్టు నెలల్లో అధికారులు భవనాన్ని సందర్శించి పరిశీలించి నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. దాదాపు వందేళ్ల చరిత్ర ఉన్న భవనంలో ప్రస్తుతం కార్యాలయ దస్త్రాలు ఉన్నాయి. భవనం నిర్వహణలో లేకపోవడంతో వృక్షాలు పెరిగి భవనంపై వనంలా మారింది. వానాకాలం వచ్చిందంటే చాలు భవనం ఎప్పుడు కూలుతుందోనని పక్కనే కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఆ భవనాన్ని ఆనుకొని వ్యాపారాలు చేసుకుంటున్న చిరువ్యాపారులు బిక్కుబిక్కుమని ఉంటున్నారు.

చర్యలు కరువు..

ఉన్నతాధికారులు భవనం కూల్చివేత వ్యవహారంపై సమగ్ర చర్యలు తీసుకోవటం లేదు. భవనాలను కూల్చివేయాలని ఖమ్మం కార్పొరేషన్ రెండేళ్లుగా హెచ్చరికలు చేస్తూ నోటీసులు కూడా ఇస్తోంది. ఈ నెల 6న కార్పొరేషన్ అధికారులు తపాలా భవనం కూలిపోయే దశలో ఉందని, వెంటనే ఆ భవనాన్ని కూల్చివేసి, శిథిలాలను తొలగించాలని హెడ్ పోస్టాఫీస్ పోస్టు మాస్టర్‌కు నోటీసులు ఇచ్చారు. శిథిల భవనం కారణంగా ఏదైనా ప్రమాదం జరిగితే మున్సిపల్ చట్ట ప్రకారం తపాలా శాఖ బాధ్యత వహించాలని కూడా నోటీసులో పేర్కొన్నారు. మున్సిపాలిటీ ఇచ్చిన నోటీసులను ప్రధాన తపాలా కార్యాలయం పోస్టు మాస్టర్ ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్‌కు పంపించారు.

ఎవరికి వారే నోటీసులు..

ఇటీవల తపాలా శాఖ ఇంజనీరింగ్ విభాగం ఏఈ భవనాన్ని పరిశీలించి ఆ భవనం తొలగింపునకు సంబంధించిన ఫైల్‌ను ఉన్నతాధికారులకు సమర్పించారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని, వ్యాపారులకు ఇచ్చిన నోటీసుల వ్యవహారాన్ని తపాలా శాఖ నివేదికగా రూపొందించి మున్సిపల్ అధికారులకు సమర్పించారు. ఈ మొత్తం వ్యవహారం చూస్తుంటే ఎవరికి వారు నోటీసులు, సమాధానాలు ఇచ్చుకుంటున్నారే తప్పా భవనం కూల్చివేత కార్యరూపం దాల్చటం లేదు.

ఢిల్లీ నుంచి అనుమతులు రావాల్సిందే..

తపాలా భవనం కూల్చివేత వ్యవహారానికి ఢిల్లీలోని కేంద్ర తపాలా శాఖ నుంచి అనుమతులు రావాల్సి ఉంది. ఇప్పటికే సూపరింటెండెంట్, ఏఈలు హైదరాబాద్ తపాలా రీజినల్ కార్యాలయానికి సమగ్ర నివేదికలు అందించారు. భవనం కూల్చివేత తర్వాత స్థల రక్షణ, ప్రస్తుతం ఉన్న భవనం రక్షణకు చుట్టూ ప్రహరీ నిర్మాణం తదితర అంశాలతో కూడిన వివరాలను నివేదికలో పొందుపర్చి పంపించారు. ఆ కార్యాలయం నుంచి నివేదిక తపాలా సర్కిల్ కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుంది. అక్కడ నుంచి ఢిల్లీలోని కేంద్ర తపాలా కార్యాలయంలోని ఆ శాఖ చీఫ్ ఇంజనీరింగ్ విభాగానికి ఫైల్ వెళ్లి శిథిల భవనం కూల్చివేతకు అనుమతులు పొందాల్సి ఉంటుంది. చీఫ్ ఇంజనీర్ కార్యాలయం నుంచి అనుమతులు లభిస్తే కూల్చివేతకు అంచనాలు రూపొందించి తిరిగి ఉన్నతాధికారులకు సమర్పించాల్సి ఉంటుంది.

నివేదికలు ఇచ్చాం



శిథిలావస్థలో ఉన్న ఖమ్మం హెడ్ పోస్టాఫీస్ భవనాన్ని తొలగించి, స్థలం ఆక్రమణలకు గురి గాకుండా వెంటనే ప్రహరీ నిర్మించాలని ఉన్నతాధికారులకు నివేదికలు అందించాం. సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు భవనాన్ని ఇటీవల పరిశీలించారు. కార్యాలయం చుట్టూ ఉన్న వ్యాపారులను ఖాళీచేయాలని నోటీసులు కూడా ఇచ్చాం. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

– బి.రవికుమార్, పోస్టల్ సూపరింటెండెంట్, ఖమ్మం డివిజన్

'దళితబంధు'లో రాజకీయ జోక్యం తగదు


మాట్లాడుతున్న మనోహర్

తిరుమలాయపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన దళితబంధు పథకాన్ని రాజకీయ జోక్యం లేకుండా దళితులందరికీ ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి నందిపాటి మనోహర్ డిమాండ్ చేశారు. సోమవారం తిరుమలాయపాలెంలో నిర్వహించిన మండల సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ. గతంలో ప్రభుత్వం దళితులకు అనేక వాగ్దానాలు ఇచ్చి మోసం చేసిందని దళితబంధు పథకాన్ని అందించి తమ చిత్తశుద్ధిని కాపాడుకోవాలన్నారు. పంచాయతీ కార్మికులకు సంఘం ధర్నా, భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పాపిట్ల సత్యనారాయణ, శ్రీను, బషీర్, వీరన్న, పల్లి రమేష్, మహేందర్, నాగేశ్వరరావు, భద్రయ్య, పుట్టల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐటీ అధ్యాపకుడికి డాక్టరేట్


రవీంద్రబాబును అభినందిస్తున్న చైర్మన్ కృష్ణ, తదితరులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాల అకడమిక్ డైరెక్టర్, అధ్యాపకుడు జూలూరు రవీంద్రబాబుకు డాక్టరేట్ లభించింది. 'ఇంపాక్ట్ సేల్స్ ప్రమోషన్స్ ఆన్ కస్టమర్ సెలక్షన్ ఆఫ్ ఎఫ్‌ఎం పీజీ గూడ్స్ – ఖమ్మం జిల్లా' అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి గాను ఏపీలోని రాయలసీమ యూనివర్సిటీ ఆయనకు డాక్టరేట్ ప్రకటించింది. ఈ సందర్భంగా రవీంద్రబాబును కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ, సెక్రటరీ, కరస్పాండెంట్ జి.ధాత్రి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ గంధం శ్రీనివాసరావు, అకడమిక్ డైరెక్టర్లు ఏవీవీ.శివప్రసాద్, జి.ప్రవీణ్‌కుమార్, సుభాష్‌చందర్ తదితరులు సోమవారం అభినందించారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం


పార్టీలోకి ఆహ్వానిస్తున్న హనుమంతరావు

కామేపల్లి(కారేపల్లి): బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ధనియాకుల హనుమంతరావు అన్నారు. సోమవారం పండితాపురం గ్రామంలో 25 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్‌ఎస్ పార్టీలో ఆదూరి ప్రసాద్, గుండ్ల వెంకటరత్నం ఆధ్వర్యంలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొమ్మినేని శ్రీనివాసరావు, మూడ్ కృష్ణప్రసాద్, దేవేందర్, రాము, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన పంచాయతీ కార్మికులు


ఖమ్మంరూరల్: రాస్తారోకో చేస్తున్న పంచాయతీ కార్మికులు

ఖమ్మంరూరల్: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా సోమవారం ఖమ్మం సూర్యాపేట ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. అంతకుముందు కార్మికులు బోనాలతో మండల పరిషత్ కార్యాలయం నుంచి ప్రదర్శనగా వెళ్లి ముత్యాలమ్మకు బోనాలు సమర్పించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు గాదె లక్ష్మీనారాయణ, చెరుకుపల్లి భాస్కర్, దండి రంగారావు, నాయకులు పి.మోహన్‌రావు బందెల వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి: పంచాయతీ కార్మికులు మండల కేంద్రంలో రాస్తారాకో నిర్వహించారు. ఖమ్మం-కోదాడ రహదారిపై ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. సీటూ జిల్లా నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు, యూనియన్ నాయకులు రహిముతుల్లా, నాగరాజు, అనిత, బొడ్డు ఆంజనేయులు, కస్తాల గోపయ్య, బుచ్చిరాములు, ఉపేందర్, నవీన్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ సిబ్బందిని అడ్డుకున్న కార్మికులు

ముదిగొండ మండలంలోని మల్లారం గ్రామ పంచాయతీకి చెందిన ప్రైవేట్ సిబ్బంది పంచాయతీ ట్రాక్టర్‌లో మొక్కలను తీసుకెళ్తుండగా సమ్మె శిబిరంలో ఉన్న పంచాయతీ కార్మికులు ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. దీంతో ప్రైవేట్ సిబ్బంది కార్మికుల నడుమ వాగ్వాదం చోటు చేసుకుంది. తాము తెలియక వచ్చామని మరోమారు రామని చెప్పటంతో పంచాయతీ కార్మికులు ఆందోళన విరమించారు.

కాంగ్రెస్ సంఘీభావం..

తిరుమలాయపాలెం: జీపీ కార్మికుల సమ్మె జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సంఘీభావం తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హామీ ఇచ్చారు. టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, మద్ది శ్రీనివాసరెడ్డి, శేఖర్‌గౌడ్, బొందయ్య, సంకీర్త్‌రెడ్డి, ఉన్నం రాజశేఖర్, పాప్యా నాయక్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపాలెం: పంచాయతీ కార్మికుల సమ్మెలో భాగంగా ఇల్లెందు ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. జేఏసీ జిల్లా కన్వీనర్ పిట్టల మల్లయ్య, దాసరి చెన్నారావు, నాయకులు రాందాస్, మంగీలాల్. రాజగోపాల్, సీతారాములు, లింగయ్య, నారాయణ, రాము, మధు, రామారావు, ఉపేందర్, కోటేశ్వరరావు, సైదులు, రేణుక, విజయలక్ష్మి, కళావతి, నాగమణి పాల్గొన్నారు.


కూసుమంచిలో..

కూసుమంచి: ఖమ్మం–సూర్యాపేట రహదారిపై జీపీ కార్మికులు రాస్తారోకో చేపట్టారు. ఇఫ్టూ రాష్ట్ర నాయకులు ఇరుగు వెంకన్న, కార్మికులు పాల్గొన్నారు.


రఘునాథపాలెంలో..


నేలకొండపల్లి: పంచాయతీ ట్రాక్టర్‌ను అడ్డుకున్న కార్మికులు


తిరుమలాయపాలెంలో..

పేదిళ్లలో వెలుగులు నింపడమే లక్ష్యం

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ
- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ


భోజనం వడ్డిస్తున్న మంత్రి అజయ్‌కుమార్


లెర్నింగ్ లైసెన్స్ అందజేస్తున్న మంత్రి

ఖమ్మం మయూరిసెంటర్: రాష్ట్ర ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డల కుటుంబాల్లో వెలుగులు నింపాలనే సంకల్పంతోనే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. నగరంలో సోమవారం ఆయన 34 మంది లబ్ధిదారులకు రూ.34.03 లక్షల చెక్కులతో పాటు చీరలు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కేసీఆర్‌ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డలకు కొండంత భరోసాగా నిలుస్తునఆనయని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు మంత్రి స్వయంగా భోజనం వడ్డించారు.

795 మందికి ఎల్‌ఎల్‌ఆర్ పత్రాలు

అందరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలనే భావనతో ఉచిత మేళా నిర్వహిస్తున్నట్లు మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తెలిపారు. పువ్వాడ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డ్రైవింగ్ లైసెన్స్ మేళాలో దరఖాస్తు చేసుకున్న 347 మందికి సోమవారం ఆయన లెర్నింగ్ లైసెన్స్ పత్రాలు అందజేసి మాట్లాడారు. ఇప్పటివరకు 795 మంది మందికి లైసెన్స్ అందజేశామని తెలిపారు. వాహనదారులు రహదారి భద్రత నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల బారిన పడకుండా కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ, డీటీఓ కిషన్‌రావు, సుడా చైర్మన్ విజయ్‌కుమార్, మార్కెట్ చైర్మన్ దోరెపల్లి శ్వేత, జిల్లా ఆర్టీఓ మెంబర్ వల్లభనేని రామారావు, ఎంవీఐ వరప్రసాద్, కార్పొరేటర్లు రావూరి కరుణ, దండా జ్యోతిరెడ్డి, పసుమర్తి రామ్మోహన్, మేడారపు వెంకటేశ్వర్లు, ఆళ్ల నిరీషరెడ్డి, చామకురి వెంకన్న, నాయకులు షౌకత్ అలీ, శీలంశెట్టి వీరభద్రం, రుద్రగాని ఉపేందర్, తోట వీరభద్రం, కన్నం ప్రసన్నకృష్ణ, షకీనా, బత్తుల మురళి, తన్నీరు శోభారాణి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు దాణా వితరణ


సేకరించిన దాణాతో సమితి ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: సోమావతి అమావాస్య సందర్భంగా శ్రీ స్తంభాద్రి సేవా సమితి ఆధ్వర్యంలో దాతలు అందజేసిన రూ.55 వేల విలువగల గోదానాను సోమవారం నగరంలోని గొల్లగూడెంలో ఉన్న ఓం శ్రీ కృష్ణ గోశాలకు అందజేశారు. గాంధీచౌక్‌కు చెందిన వ్యాపారి పెనుగొండ రామ్మోహన్‌రావు గోశాలలో 'గరకు స్తంభం' ఏర్పాటుకు రూ. 15 వేల నగదును సమితి ప్రతినిధుల ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి కన్వీనర్ తూములూరి లక్ష్మీనరసింహారావు, కార్యదర్శి పెనుగొండ శ్రీనివాస్ రావు, సభ్యులు సూరినేటి మల్లేశం, జంగిలి రమణ, సోమారపు సుధీర్‌కుమార్, పులిపాటి సంపత్‌కుమార్, వంగవీటి నవీన్, సుబ్బారావు, సాయికుమార్, రాజేంద్రప్రసాద్, సిరికొండ వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, మురళీధర్ రావు, దాతలు గోక కుమార స్వామి, పెనుగొండ ఉమాశంకర్ రావు, చల్లా రమేష్, గోశాల బాధ్యులు కేసా హనుమంతరావు, చైన్సింగ్ రాజాపు రోహిత్‌లు పాల్గొన్నారు.

అక్రమకేసులు ఎత్తివేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: మల్లిబాబు యాదవ్‌పై పెట్టిన అక్రమకేసులు ఎత్తివేయాలని అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర సభ్యుడు నాగ సీతారాములు యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కామేపల్లి మండలం పండితాపురంలో ఇటీవల జరిగిన ఇరు వర్గాల ఘర్షణలో సంబంధం లేకపోయినా మల్లిబాబు యాదవ్ పై అక్రమ కేసులు బనాయించి జైలుకు తరలించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కేసు ఉపసంహరించకపోతే యాదవసోదరులను కలుపుకుని ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఓడీసీ జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, కృష్ణవేణి, హరిబాబు, సైదులు, బండారి ప్రభాకర్, వంశీ, నాగేశ్వరరావు, సురేష్ పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

తిరుమలాయపాలెం: మండలంలోని దమ్మాయిగూడెంకు చెందిన డిజిటల్ టీవీ చానల్ రిపోర్టర్ బోడపట్ల సతీష్ ఇంటిపై ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ సందర్భంగా ఇంట్లోకి చొరబడి కారు అద్దాలు, కంప్యూటర్‌ను ధ్వంసం చేయగా ఆయన సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్‌ఐవరాల శ్రీనివాస్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సోదరిపై దాడి ఘటనలో..

ఖమ్మంరూరల్: సోదరిపై దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఎస్సై వెంకటకృష్ణ వివరాల ప్రకారం.. మండలంలోని ఆరేకోడుకు చెందిన మాళోతు నాగమణి సోదరులు దాస్, హరిదాసు తమ తల్లిదండ్రులను సరిగా చూసుకోకపోవడంతో వారు నాగమణి దగ్గర ఉంటున్నారు. ఈ మేరకు తమ కుమారులు తమని బాగా చూసుకునే విధంగా బుద్ధి చెప్పాలని తల్లిదండ్రులు గ్రామపెద్దలకు చెప్పారు. దీంతో ఆగ్రహించిన దాస్, అతని భార్య శాంతి ఆగ్రహంతో నాగమణిపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ సోమవారం ఉపాధ్యాయులు బీజేపీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర మన్‌కీబాత్ కన్వీనర్ గెంటెల విద్యా సాగర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో ముందుకు సాగాలి

నేలకొండపల్లి: కారంచేడు అమరవీరుల స్ఫూర్తితో ముందుకు సాగాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పగిడికత్తుల ఈదయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం కారంచేడు అమరవీరుల 38వ సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... దళితులపై పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్లలో దళితులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. గుండెపొంగు శ్రీకాంత్, సాలయ్య, శేఖర్, వినయ్, దిసిందర్, శివ, శ్రీను, నాగరాజు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

రోడ్డు అంచునే బావి



ఖమ్మంనగరం నుంచి కామంచికల్ ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డులో రామన్నపేట- కామంచికల్ రోడ్డును ఆనుకోని వ్యవసాయబావి ప్రమాదకరంగా ఉంది. ఆ రోడ్డును డబుల్ రోడ్డుగా మారుస్తూ నిర్మాణపనులు సాగుతున్నాయి. ఈ క్రమంలో రోడ్డు వెడల్పు పెరగడంతో బావి ప్రస్తుతం రోడ్డు అంచుకువచ్చింది. ఆ రోడ్డులో రాకపోకలు సాగించే వారు ఆదమరిస్తే బావిలో పడినట్లే. తక్షణం అధికారులు ప్రమాదకరంగా ఉన్న బావి వద్ద ప్రమాదాలు చోటు చేసుకోక ముందే తగు రక్షణ చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. - ఖమ్మంఅర్బన్

ప్రశ్నించాల్సిన అధికారి : విశ్వనాథం, ఆర్‌అండ్‌బీ ఏఈ, ఖమ్మం
సెల్ నంబర్ : 9440819004